


# నవభూమి వరంగల్

అనుబంధం

26 సెప్టెంబర్,2024 గురువారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


# సమగ్ర'శిక్ష'

**భూపాలపల్లిటౌన్, –నవభూమి:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల సిబ్బందికి వెతలు తప్పడం లేదు. సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగు లు, ఉపాధ్యాయినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఎంత వెట్టిచాకిరీ చేస్తున్నా పనికి తగ్గ వేతనం వీరికి అందడం లేదు. మందరూ మహిళలే అయినప్పటికీ వారికి కనీసం ఆప్షనల్ హాలీడేస్ దొరకడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు హాస్టళ్లకు కేర్‌టేకర్లు, నైట్ వాచ్‌వుమన్లు లేక తమకు రక్షణ కరువుతోందనే ఆందోళన విద్యార్థినుల్లో వ్యక్తమవుతోంది.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండ లాలు ఉన్నాయి. 11 మండలాల్లో కస్తూర్బా గాంధీ విద్యాల యాలు ఉన్నాయి. వీటిల్లో ప్రస్తుతం సుమారు 265 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. బోధన సిబ్బంది (టీచర్లు) 125 మంది, బో ధనేతర సిబ్బంది సుమా రు 140 మంది పని చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తగా మరో 38 మందిని బోధన సిబ్బందిని నియమించేందుకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఈ విద్యాలయాల్లో సిబ్బంది కొరత ఇంకా ఉంది. 14 మంది టీచర్లు, 50 నుంచి 60 మం ది వరకు ఇతర ఉద్యోగులు అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.సమస్యలతో సతమతం కేజీబీవీల్లో అనేక సమస్యలు ఉన్నాయి. వీటిని ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు ఎవరికీ చెప్పుకోలేక సతమతమవుతున్నారు. స్పెషల్ అధికారి, సీఆర్‌టీ సహా కంప్యూటర్ ఆపరేటర్ సిబ్బంది అంతా చాలీచాలని వేతనాలతో ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారు. ఎస్‌వోలకు జీతం రూ.33వే లు కాగా సీఆర్‌టీలకు రూ.26 వేలు అందుతోంది. సీఆర్‌పీలకు రూ.19,500, అకౌంటెంట్లకు రూ.14,300, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.7,800 మాత్రమే ఇస్తున్నారు. అంతేకాదు.. ఏఎన్‌ఎంలు, నైట్ వాచ్ వుమన్లు, డే వాచ్ వుమన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు.. ఇలా అందరికీ పనికి తగిన వేతనం ఇవ్వడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది.కేర్‌టేకర్లు, వాచ్‌వుమన్లు లేక..11 విద్యాలయాల్లో నాలుగింటిలో కేర్‌టేకర్లు, నైట్‌వాచ్‌వుమన్లు లేక విద్యార్థినులకు భద్రత లేకుండా పోతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా మల్హర్ మండలంలోని మల్లారం, గాదంపల్లి మధ్యలోని కేజీబీవీలో నైట్‌వాచ్‌వుమన్ లేక విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే టీచింగ్ స్టాఫ్ లేకపోవడంతో ఎనిమిది పీరియడ్లకు ఒకరే బోధించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు విద్యాలయాల్లో స్కావెంజర్లు లేక తీవ్ర సమస్య తలెత్తుతోందని అంటున్నారు.ఆప్షనల్ హాలీడేలు లేక..కేజీబీవీలో మహిళా ఉపాధ్యా యులే విధులు నిర్వర్తిస్తుంటారు. ఏదైనా పెద్ద పండుగ వచ్చినప్పుడు ఆ మరుసటి రోజు సెలవు తీసుకో వడానికి సాధారణంగా



ప్రభుత్వ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఆప్షనల్ హాలీ డేలు అధికా రులు మంజూరు చేస్తారు. కేజీబీవీల్లో మాత్రం అలాంటివి లేవని చెబుతున్నారు. హాలీడేలు లేకపో వడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని ఉపా ధ్యాయినులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.డిమాండ్ ఇవే..సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం స్కేలు అమలు చేయాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ.10లక్షలు వర్తింపజే యాలని, ఆరోగ్యబీమా రూ.5లక్షలు వర్తింపజే యాలని, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వా లని కోరుతున్నారు. పదేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని పర్మనెంటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.విద్యార్థినులకూ ఇబ్బందులే...ఒక్కో కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సుమారు 250 నుంచి 350 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలల్లో వేడినీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం పనిచేయడం లేదు. దీంతో విద్యార్థినులు చల్లని నీటితోనే స్నానం చేస్తున్నారు. మరుగుదొడ్లు సరిపోకపోవడంతో సమయం వృ?థా అవుతోందని వారు అంటున్నారు. పైగా పలుచోట్లా డోర్లు పాడైపోవడం, మరుగుదొడ్ల ట్యాంకులు నిండి వాటిని సకాలంలో శుభ్రం చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. గతంలో మాదిరిగా న్యాప్కిన్స్ ఇవ్వడం లేదని, హెల్త్ కిట్‌కు బదులు రూ.100 చెల్లిస్తున్నారని తెలిపారు. అవి కూడా ఎప్పుడు మంజూరవుతాయో తెలియని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థినులు అంటున్నారు.

## పనుల్లో జాప్యం.. రాకపోకలు కష్టం..!



### ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ మెరిట్ లిస్ట్

# రేపే విడుదల

**వరంగల్:–నవభూమి:** ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును విడుదల చేయనున్నట్లు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్ రెడ్డి వెల్లడించారు. బుధవారం ఉదయం మెరిట్ లిస్టును విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం తుది మెరిట్ లిస్టు విడుదల చేస్తామని వీసీ వెల్లడించారు. అదే రోజు(గురువారం) నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధంగా ఉండాలని కరుణాకర్ రెడ్డి సూచించారు. గత సంవత్సరానికి సంబంధించిన కాలేజీల వారీ సీట్ల అలాట్‌మెంట్ వివరాలు యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. వాటిని పరిశీలించి వెబ్ ఆప్షన్ల కోసం ముందే కాలేజీల జాబితాను సిద్ధం చేసుకుంటే, ఆప్షన్ల నమోదు ప్రక్రియ సులభం అవుతుందని వీసీ కరుణాకర్ రెడ్డి విద్యార్థులకు తెలిపారు.సుప్రీంకోర్టుకు చేరిన వివాదం..తెలంగాణ రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి రంగం సిద్ధమైంది. కౌన్సెలింగ్ ప్రక్రియకు సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వడంతో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం చర్యలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ జారీ చేసిన జీవో 33పై 135మంది విద్యార్థులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి స్థానికత విషయమై వారు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు స్థానికతపై మార్గదర్శకాలను రూపొందించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. దీనిపై రేవంత్ రెడ్డి సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టిన ధర్మాసనం హైకోర్టు తీర్పుపై తాత్కాలిక స్టే ఇస్తూ 135మంది కౌన్సెలింగ్‌కు అనుమతిస్తూ గత శుక్రవారం తీర్పునిచ్చింది. దీంతో సీట్ల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది.మ్మొత్తం సీట్లు ఇవే.. తెలంగాణలో 34 ప్రభుత్వ, 30 ప్రైవేటు వైద్య కళాశాలలు ఉన్నాయి. వాటిలో కన్వీనర్ కోటాలో 5,798సీట్లు ఉండగా.. మేనేజ్‌మెంట్ కోటాలో 1,955ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇప్పటికే మేనేజ్‌మెంట్ సీట్లకు 6,468మంది, కన్వీనర్ కోటా సీట్లకు 17,654మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీటితోపాటు కోర్టును ఆశ్రయించిన 135మంది అడ్మిషన్లకు పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో ఇప్పటికే జాతీయ కోటా కింద ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 647సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది నీట్–యూజీ పరీక్షను 77,849మంది రాయగా వారిలో 47,356మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో కొత్తగా మరో 8 ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి రావడంతో 400సీట్లు అదనంగా పెరిగాయి.



## తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీ రాములు పేరే కొనసాగాలి

### సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన కాటారం మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు





**కాటారం,సెప్టెంబర్ 25 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలిగించి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టినందుకు తెలంగాణ ప్రభుత్వం యొక్క వైఖరిని ఖండిస్తూ నిరసన తెలుపుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును యధావిధిగా కొనసాగించాలని కోరుతూ బుధవారం రోజున కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ కు కాటారం ఆర్యవైశ్య సంఘం అద్యక్షుడు అనంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఇట్టి కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పవిత్రం శ్రీనివాస్,కాటారం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అనంతుల శ్రీనివాస్,మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మద్ది కమల మనోహర్,మండల ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కముటాల రవీందర్,మండల అవోపా అధ్యక్షులు మద్ది లక్ష్మి నరసింహమూర్తి,కాటారం కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు కలికోట శ్రీనివాస్,జిల్లా యువజన సంఘం వర్కింగ్ కమిటీ అధ్యక్షులు దారం నగేష్ కుమార్,ఆనంద ధర్మశాస్త్ర ఆలయ చైర్మన్ బచ్చు ప్రకాష్,అల్లాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ములుగులో సబ్ ఆర్సీవో కార్యాలయం ఏర్పాటు



**ములుగు, –నవభూమి:** గిరిజన రీజినల్ కో–ఆర్డినేటర్ కార్యాలయం మహబూబాబాద లోనే ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ములుగులో సబ్ రీజినల్ కో–ఆర్డినేటర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని మంగళవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. మహబూబాబాద్‌లోని ఆర్‌సీవో కార్యాలయాన్ని తరలిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు నమ్మొద్దని సూచించారు. ములుగులో ఏర్పాటు చేయనున్న సబ్ ఆర్సీవో కార్యాలయంతో భూపాలపల్లి జిల్లాతో పాటు ములుగు ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు. అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులను అందుబాటులో ఉంచడానికి ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ములుగు, మహబూబాబాద్ జిల్లాలతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు.

## అసంపూర్తి వారధి..

# రవాణాకు అష్టకష్టాలు

**వెంకటాపురం, –నవభూమి:** అధికారుల ముందుచూపు లేమి, గుత్తేదారు నిర్లక్ష్యం వెరసి గ్రామీణుల పాలిట శాపంగా మారి ప్రయాణానికి ప్రయాస పడాల్సి వస్తోంది.వెంకటాపురం మండలంలోని మల్లాపురం మార్గంలో కంకలవాగుపై వారధి నిర్మాణం అసంపూర్తిగానే వెక్కిరిస్తోంది. ప్రభుత్వం రూ.4.11 కోట్ల నిధులను కేటాయించినా నిర్మాణం పూర్తికాకపోవడం, ఈ వాగుపై ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రహదారి ధ్వంసం కావడంతో రవాణా కష్టాలు నిత్యకృత్యంగా మారాయి. స్థానికులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లే కర్షకులు అష్టకష్టాలతో సుదూర ప్రయాణం చేయాల్సిన ధైన్యస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయ మార్గాన్ని పునురుద్ధరిస్తేనే గోస తీరనుంది.పిల్లర్లకే పరిమితం వెంకటాపురం–మల్లాపురం మార్గంలో చేపట్టిన వారధి నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. ఏడాది కిందటనే ప్రభుత్వం నిధులను కేటాయించినా సకాలంలో పనులు ప్రారంభం కాకపోవడంతో ఈ ఏడాది వర్షాకాలం కష్టాలు యథాతథంగానే మారాయి. ఐదు పిల్లర్లు 75 మీటర్ల పొడవుతో చేపట్టిన ఈ పనులు ప్రస్తుతం మధ్యలోనే ఆగిపోయాయి. నిర్మాణ గడవు సైతం ముగిసినట్లు తెలుస్తోంది. మళ్లీ ప్రభుత్వం నుంచి గడవును పొడగిస్తేనే పనులు ముందుకు సాగే అవకాశం ఉంది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు ప్రత్యామ్నాయంగా నిర్మించిన అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి గండి పడింది. దీంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.ధ్వంసమైన ప్రత్యామ్నాయ మార్గం వెంకటాపురం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సబ్ డివిజన్ పరిధికి చెందిన ఈ వంతెన, దారి దుస్థితిని పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. గత నెలలో జరిగిన బదిలీల్లో ఇక్కడి ఏఈఈ ఖమ్మం బదిలీపై వెళ్లారు. ఆ స్థాయికి చెందిన మూడు పోస్టులు, ఇతర ఉద్యోగుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అదే సమయంలో డీఈఈ పోస్టు నియామకం పట్టింపు కరవైంది. ఈ మార్గం ద్వారానే మల్లాపురం, కర్రివానిగుంపు గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారు. వెంకటాపురం, చొక్కాల, వీఆర్‌కేపురం, శివాపురం ప్రాంతాలకు చెందిన రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్తుంటారు. ఇక్కడి ప్రత్యామ్నాయ దారి ధ్వంసం కావడంతో దాదాపు 6 కిలోమీటర్ల సుదూర ప్రయాణం చేయాల్సి వస్తోంది.తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం మడకం పాపారావు, మల్లాపురం వంతెన పూర్తికాకపోవడం, ప్రత్యామ్నాయ దారి పాడవ్వడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అత్యవసరమైతే ప్రాణాలను అరచేతిలో





పెట్టుకుని సుదూరం నుంచి రవాణా సాగిస్తున్నాం. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలి.తక్షణం పూర్తి చేయాలి..నీలారపు శ్రీను, వెంకటాపురం కంకలవాగు ఆవలి ప్రాంతంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లిరావడం కష్టంగా ఉంది. అప్రోచ్ రోడ్డు తెగిపోవడంతో వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దుక్కులు దున్నడానికి సైతం చుట్టూ తిరిగి వెళ్తున్నాం. ఇక్కడి పనులను తక్షణం పూర్తి చేస్తేనే రాకపోకలకు ప్రయోజనం.

## పనుల్లో జాప్యం..

# రాకపోకలు కష్టం..!

**చిన్నగూడూరు –నవభూమి:** మహబూబాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవహించి పంటలు, రహదారులు దెబ్బతిన్నాయి.చిన్నగూడూరు – ఉగ్గంపల్లి మధ్య ఆకేరువాగు వంతెన ముందు రహదారి కోతకు గురైంది. ప్రస్తుతానికి మట్టి పోసి తాత్కాలిక మరమ్మతులతో రవాణా సౌకర్యం కల్పించారు. జయ్యారం నుంచి కందికొండ, సూధనపల్లి మీదుగా వెళ్లే రహదారిలో రామసముద్రం చెరువు ఉప్పొంగి రహదారి రెండు చోట్ల కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దెబ్బతిన్న రహదారులను మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, డోర్నకల్ శాసనసభ్యుడు రామచంద్రునాయక్ పరిశీలించి త్వరితగతిన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 24 రోజులు దాటుతున్న పునరుద్ధరణ పనుల్లో వేగం కొరవడంది. రాకపోకల్లో ఇబ్బందులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాత్కాలిక మరమ్మతు పనులు ఎమ్మెల్యే రామచంద్రునాయక్ చొరవతో చేపడుతున్నట్లు స్థానిక నేతలు తెలపారు.ధ్వంసమైన కట్ట రహదారి మంగోలిగూడెం, మన్నెగూడెం గ్రామాల విద్యార్థులు జయ్యారం పాఠశాలకు వెళ్లేందుకు రామసముద్రం చెరువుకట్టపై ఉన్న రహదారి మీదుగా వెళ్లాలి. వరద ఉధృతికి రహదారి కొట్టుకపోగా పునరుద్ధరణ పనుల్లో జాప్యం నెలకొంది. దీంతో రోజూ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాల నుంచి దెబ్బతిన్న రహదారి వరకు ఆటోల్లో వచ్చి నీళ్ల గుంతల నుంచి ప్రమాదకరంగా వెళ్తున్నారు.





## అంగన్వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమం

**చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలి,ఎత్తుకు తగ్గట్టుగా బరువు ఉండాలి**

**ఐసీడీఎస్ సూపర్వైజర్ వీణ,డాక్టర్ వందన**





**కాటారం,సెప్టెంబర్ 25 నవభూమి ప్రతినిధి:** కాటారం మండలం దన్వాడ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం లో బుధవారం రోజున పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.గర్భిణీ సమయం నుంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యమైన పిల్లలకు జన్మనిస్తారని అలాగే గర్భిణీలు,బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్వైజర్ వీణ,డాక్టర్ వందన లు సూచించారు.పోషణ మాసం కార్య క్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ధన్వాడ గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో వివిచ్ఎస్ఎన్డీ నిర్వహించారు.ఈసందర్భంగా చిన్నారులకు ఎత్తు,బరువు పరీక్షించారు.బరువు తక్కువగా ఉన్న పిల్లలను,సామ్,మామ్ పిల్లలను గుర్తించారు.పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతం తిని పించాలని దానివల్ల ఎత్తుకు తగిన విధంగా బరువుతో ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పించారు.అనంతరం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.గర్భిణీలు, బాలింతలు,పిల్లలు, కిషోరబాలికలు ర్యాలీ నిర్వహించారు.కూరగాయలు,ఆకుకూరలు,చిరు ధాన్యాలు రోజువారీ ఆహారంలో తప్పకుండా తీసుకోవాలని అవగాహన కల్పించారు.ఈ కార్య క్రమంలో సూపర్వైజర్ వీణ,డాక్టర్ వందన, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి,అంగన్వాడీ టీచర్లు కారెంగుళ శ్రీలత,తిత్తుల రజిత,ఏఎన్ఎం రజిత,ఆశా సంధ్య,తల్లులు, గర్భిణీలు,కిషోర బాలికలు గ్రామస్తులు పాల్గొన్నారు

## పేదల ఇళ్లు కూల్చొద్దు

**మహబూబాబాద్, -నవభూమి:** జిల్లా కేంద్రంలో రెండు దశాబ్దాల కిందట ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని తలారి వెంకటేశ్వర్లు కాలనీ ఏర్పాటైందని అప్పటి నుంచి అక్కడే నివసిస్తున్న నిరుపేదల ఇళ్లను కూల్చొద్దంటూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.సీపీఐ పురపాలక సంఘం ఫ్లోర్‌లీడర్ బి.అజయసారథి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో ఆ కాలనీకి చెందిన మద్దినేని నర్సమ్మ ఇల్లు కూలిపోయిందన్నారు. ఆ ఇంటిని పునర్నిర్మాణం చేసుకుంటుండగా రెవెన్యూ, పురపాలక అధికారులు కూలగొట్టారన్నారు. దాసరి నాగభూషణ్‌రావు కాలనీలో పేదలు నివసిస్తుంటే పెద్దల భవంతులను వదలి వరద కాలువను కాలనీకి మళ్లించి వారికి నోటీసులు పంపిస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.




### కల్లు గీత కార్మికులకు కాటమయ్య

# రక్షా కవచంపై అవగాహన









**కాటారం,సెప్టెంబర్ 25 నవభూమి ప్రతినిధి:** కాటారం మండలం దన్వాడ గ్రామంలో బుధవారం రోజున ఎక్సైజ్ డిపార్ట్మెంట్,బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ల సమన్వయం తో కల్లు గీత కార్మికులకు ఉపయోగపడే కాతమయ్య రక్షా కవచం గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొంతమంది కల్లు గీత కార్మికులకు శిక్షణ కూడా ఇచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన 134 మంది కల్లు గీత కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సంధర్భంగా కాటమయ్య రక్షా కవచం ఉపయోగం గురించి శిక్షణ పొందిన వారి నుండి గీత కార్మికులకు శిక్షణ,అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కాటారం ఎక్సైజ్ సబ్ ఇన్ స్పెక్టర్ బి.కిష్టయ్య,హెడ్ కానిస్టేబుల్ రామచందర్, కానిస్టేబుళ్లు వెంకటరాజు,కోటేశ్వర్,కాటమయ్యా రక్షా కవచం ట్రైనర్ లు హెడ్ ట్రైనర్ జస్వంత్, తిరుపతి,అంజన్న,అశోక్,వెంకట్రాజం,కల్లు గీత కార్మికులు చీటూరి లింగం గౌడ్(టిసిఎస్ దన్వాడ అధ్యక్షుడు),మార్కా రవీందర్,కారెంగుల వేంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

# హర..హరా..కష్టాలు కనరా!

**జయశంకర్ భూపాలపల్లి-నవభూమి:** జిల్లాలోని 353సీ జాతీయ రహదారి తెలంగాణ-మహారాష్ట్రలను కలుపుతుంది.చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి కూడా సులువైన రాకపోకలకు ఇదే ప్రధానం.. కాళేశ్వరం వద్ద గోదావరిపై అంతరాష్ట్ర వంతెన నిర్మాణంతో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రవాణా మెరుగుపడింది.. ఇదే జాతీయ రహదారిలో కాళేశ్వరం-మహదేవపూర్ మధ్య మాత్రం రహదారి విస్తరణకు నోచుకోక.. వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి ఉమ్మడి జిల్లాలో కాళేశ్వరం నుంచి మొదలై ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ వరకు ఉంటుంది. దాదాపు 101 కి.మీ సాగుతుంది. గుడెప్పాడ్ నుంచి మహదేవపూర్ వరకు విస్తరణ పనులు మూడేళ్ల క్రితమే పూర్తయ్యాయి. కానీ, కాళేశ్వరం-మహదేవపూర్ మధ్య 17 కి.మీ మేర పెండింగ్‌లో ఉన్నాయి. ఏళ్లుగా కాలయాపన జరుగుతోంది. 2022 నవంబర్ 12వ తేదీన రామగుండం ఎరువుల కర్మాగారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా ప్రారంభించారు. అదేరోజున అక్కడే రూ.163 కోట్లు నిధులతో నిర్మించతలపెట్టిన కాళేశ్వరం-మహదేవపూర్ రహదారికి ప్రధాని శంకుస్థాపన చేశారు. రెండేళ్లుకావస్తున్నా పనులు ప్రారంభం కాలేదు.కుదురుపల్లి వద్ద వంతెన వద్ద ఇరుకు రహదారి, వాహనదారుల ఇబ్బందులు..తాత్కాలిక మరమ్మతులతో సరి మహదేవపూర్-కాళేశ్వరం గోదావరి వంతెన వరకు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. రహదారి మొత్తం గుంతలమయంగా మారడంతో తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. మార్గంమధ్యలోని కుదురుపల్లి వద్ద వంతెన వర్షాలకు దెబ్బతిని ప్రమాదభరితంగా మారింది. కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాదిగా భక్తులు తరలివస్తారు.. అలాగే మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌కు పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతాయి.రహదారి కింద కోల్పోయే చెట్లను పరిశీలిస్తున్న అటవీ అధికారులు విస్తరణ కుదింపు ఈ ప్రాంతంలో ముందుగా జాతీయ రహదారి 22 మీటర్ల వరకు విస్తరించాలని నిర్ణయించారు. కానీ పెద్ద సంఖ్యలో చెట్లు కోల్పోవాల్సి వస్తుందని.. 16 మీటర్ల వరకే రహదారి నిర్మించాలని అటవీశాఖ నిర్ణయం తీసుకుంది. విస్తరణలో కోల్పోనున్న చెట్లను లెక్కించేందుకు నంబర్లు కూడా వేశారు. దాదాపు 7800 చెట్లు కోల్పోతున్నట్లు అంచనా.. వాటికి పరిహారం కూడా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే 25 హెక్టార్ల స్థలాన్ని అటవీ శాఖకు అప్పగించేందుకు చిట్యాల, రేగొండ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించినట్లు సమాచారం.ఆ 2 కి.మీపై స్పష్టత ఏదీ? కాళేశ్వరం శివారు నుంచి గోదావరి వంతెన వరకు దాదాపు 2 కి.మీ రహదారి విస్తరణకు భూ సేకరణ సమస్యగా మారుతోంది. మూడుచోట్ల ప్రతిపాదన చేసినా స్థానికులు, రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పాతమార్గంలో, విద్యుత్తు ఉపకేంద్రం సమీపం నుంచి రెండు మార్గాలను ప్రతిపాదించినా ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికైనా భూసేకరణ, అటవీ అనుమతులు పూర్తిచేసి పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

